ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 నవంబరు 2024





శ్రీశైలానికి సీప్లేన్



సీ ప్లేన్ నుంచి బయటకు వస్తున్న సీఎం చంద్రబాబు

- విజయవాడ నుంచి తొలి సర్వీసు
- మొదటి ప్రయాణం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

నంద్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఓ అద్భుత ఘట్టానికి వేదికగా నిలిచింది. అధునాతన టెక్నాలజీతో కూడిన సీ ప్లేన్ ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ఇక మీదట మల్లన్న సన్నిధికి చేరుకునే భక్తులకు ప్రయాణం వేగవంతం, సులభతరం కానుంది. శనివారం విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి ఎగిరిన సీ ప్లేన్ శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్‌పై మధ్యాహ్న ఒంటిగంట సమయంలో ల్యాండ్ అయింది. నీటిని చిమ్ముకుంటూ.. చీల్చుకుంటూ వచ్చిన సీ ప్లేన్ జెట్టీ దగ్గర ఆగింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజాప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



ఇది రాష్ట్రంలోనే మొదటి సీ ప్లేన్ సర్వీసు కాగా ఇందులో ప్రయాణించిన మొదటి వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు. సీప్లేన్‌లో 40 నిమిషాల్లోనే విజయవాడ నుంచి శ్రీశైలానికి చేరుకోవచ్చు. ప్రస్తుత ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సీ ప్లేన్ సర్వీసు మార్చి నుంచి అందుబాటులోకి రానుంది.

వివరాలు 7లో..



ముఖ్యమంత్రికి స్వాగతం



సీ ప్లేన్‌లో చంద్రబాబు



ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు



శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను చీల్చుకుంటూ వస్తున్న సీ ప్లేన్

ఆలయాలను కాపాడుకుందాం

- ప్రజలకు అఘోరీ పిలుపు
- విజయవాడ దుర్గమ్మ దర్శనంతో యాత్ర ముగిస్తానని వెల్లడి



పూజలు నిర్వహించి వస్తున్న అఘోరీ

మహానంది, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): హిం దూ ఆలయాలను కాపాడుకునేందుకు అందరం కలిసి కట్టుగా పోరాడుదామని అఘోరీ పిలుపునిచ్చారు. శనివారం మహానంది క్షేత్రంలో అఘోరీ ప్రత్యేక పూజ లు నిర్వహించారు. యాగంటిని సందర్శించుకొని మహానందికి వచ్చిన ఈమెకు ఆలయ ముఖ మం డపం వద్ద ఏఈఓ ఎర్రమల్ల మధు, వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణ మండపంలో వేదపండితులు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం అఘోరీ మాట్లాడుతూ గో హత్య, స్త్రీ హత్యలు జరగకుండా పో రాటం చేయాలన్నారు. ప్రస్తుతం చిన్న పిల్లలపైన అఘాయిత్యాలు జరుగుతున్నాయని, వాటిని అరి కట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సనాతన ధర్మం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. తాను ఇప్పటి వరకు శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండియాలోని శక్తి పీఠాలతో పాటు ప్రసిద్ధి చెందిన క్షేత్రాలను దర్శించు కున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే తెలుగు రాష్ట్రాల్లోని క్షేత్రాలను సందర్శిస్తూ మహానందికి వచ్చాని తెలిపారు. మీడియా వల్లే తనకు ప్రజల్లో ఇంత క్రేజ్ వచ్చిందని చెప్పారు. శ్రీశైలం క్షేత్రానికి వెళ్తున్నానని, అనంతరం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడంతో తన యాత్ర ముగుస్తుందన్నారు. మహానందిలో అఘోరీని చూసేందుకు భక్తులు, స్థానిక ప్రజలు ఆసక్తి చూపారు.

చీరలే శ్రీరామ రక్ష



అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు వినూత్న ప్రయత్నం

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు కొత్త కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. పంట చుట్టూ చీరలను కట్టుకుంటున్నారు. గట్ల దగ్గర కర్రలకు ఫ్యాన్ రెక్కలు, సీసాలు ఏర్పాటు వంటివి చేసుకుంటున్నారు. ఇప్పటికే అడవి పందులు మొక్కజొన్న పంటలను నాశనం చేసి నష్టం కలిగిస్తుండడంతో రైతులు తమకు తోచిన ఆలోచనను అమలులో పెడుతున్నారు. చీర రూ.30 ప్రకారం 400 చీరలను కొనుగోలు చేసి పంట పొలాల చుట్టూ ఏర్పాటు చేసుకున్నామని కౌలు రైతులు ఓబులేసు, చాంద్‌బాష, రామకృష్ణ తెలిపారు. పెద్దవంగలి, చిన్నవంగలి, చింతలచెరువు, పెద్దబోదనం, మల్లేవేముల తదితర గ్రామాల సమీపంలో మొక్కజొన్న పొలాలకు చీరలు కట్టుకున్నారు. చాగలమర్రిలో పూల తోటల వద్ద ఫ్యాన్ రెక్కలకు సీసాలు అమర్చుతున్నారు. దీంతో శబ్దానికి వన్యప్రాణులు పొలాల వైపు రాకుండా పోతున్నాయి.

కుడా చైర్మన్‌గా సోమిశెట్టి



- విధేయతకు రెండోసారి అవకాశం
- వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బొజ్జమ్మ
- కురుబ కార్పొరేషన్‌కు దేవేంద్రప్ప
- ముస్తాక్ అహ్మద్‌కు స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్
- బీజేపీ కోటాలో న్యాయవాది సావిత్రికి రజక కార్పొరేషన్

కర్నూలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రాధాన్యం లభించింది. నలుగురికి కీలక పదవులు దక్కడంతో టీడీపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ పదవి రెండో పర్యాయం వరించింది. కర్నూలు జిల్లాలో ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కప్పట్రాళ్ల బొజ్జమ్మకు ఏపీ వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, బీజేపీ కోటాలో ఆదోనికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రికి రజక కార్పొరేషన్ కేటాయించారు.ఆదోని నియోజకవర్గం నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు, ఆదోని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెద్దహరివాణం దేవేంద్రప్పకు కురుబ/కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దక్కగా నంద్యాల జిల్లా నుంచి నంద్యాల పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు ముస్తాక్ అహ్మద్‌కు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో పొత్తు, సామాజిక సమీకరణాల్లో భాగంగా సీట్లు త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిలకు మళ్లీ నిరాశే మిగిలింది. అయితే అసెంబ్లీ సమావేశాలు తరువాత నామినేటెడ్ పదవులకు సంబంధించి మూడో జాబితా ప్రకటించే అవకాశం ఉంది. సీట్లు త్యాగం చేసిన నేతలు, పార్టీ గెలుపు కోసం కష్టపడిన నాయకులకు అవకాశం ఉంటుందని రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసినట్లు సమాచారం.



కప్పట్రాళ్ల బొజ్జమ్మ



దేవేంద్రప్ప



ముస్తాక్ అహ్మద్



సావిత్రి

విధేయతకు మళ్లీ అవకాశం

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి, అధినేత చంద్రబాబుకు విధేయుడుగా కొనసాగుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును రెండవసారి కుడా చైర్మన్ పీఠం కేటాయించారు. 1982లో హైదరాబాద్ నిజాం గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో.. ప్రభంజనంలా తరలివచ్చిన జనం మధ్య ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించారు. ఆ వేదికపైనే పలువురు నాయకులకు టీడీపీ సభ్యత్వం ఇచ్చారు. కర్నూలు జిల్లా నుంచి పార్టీ ఆవిర్భావం రోజున సభ్యత్వం తీసుకున్న వారిలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి, శేగు వెంకటరమణ, ఉచ్చప్ప, వెంకటస్వామితో పాటు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీవీ రెడ్డిలు ఎన్టీఆర్ సమక్షంలో టీడీపీ చేరారు. ఆయన చేతులు మీదుగా సభ్యత్వం తీసుకున్నారు. ఆనాటి నుంచి టీడీపీలోనే కొనసాగుతూ నాడు టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, నేడు అధినేత చంద్రబాబులకు అత్యంత సన్నిహితుడుగా ఉంటూ వస్తున్నారు. 25 ఏళ్లపాటు ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2017లో కుడా తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, అధినేత చంద్రబాబు మరోసారి అవకాశం ఇవ్వడంతో ఆ పదవి రెండవ పర్యాయం కూడా వరించింది. ఈ పీఠం కోసం టీడీపీ సీనియర్ నాయకులు పలువురు పోటీ పడినా అధినేత చంద్రబాబు సోమిశెట్టి వైపే మొగ్గుచూపారు.

మిగతా 6లో..

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శనివారం భక్త జన సందడి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు కార్తీక మాసం పురస్కరించుకొని పరమ శివుడి దర్శనం కోసం మహానందికి తరలివచ్చారు. దీంతో పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. గంటల కొద్దీ క్యూలో నిల్చుని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. దర్శన సమయంలో భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిరంతర దర్శనం ఏర్పాటు చేశామని ఈవో చెప్పారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు క్షేత్రంలో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.



మహానందిలో క్యూలో నిల్చున్న భక్తులు

వీఆర్‌కు ఆలూరు సీఐ

విధుల్లో చేరిన నాలుగు నెలలకే చర్యలు

ఆలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్‌ను వీఆర్‌లోకి పంపుతూ పోలీసు శాఖ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. పేకాటను నియంత్రించడంలో విఫలం కావడం వల్లే చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. అంతేగాకుండా సివిల్ పంచాయితీలు చేస్తూ ఒక వర్గానికే వత్తాసు పలికారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ మేరకు విధుల్లో చేరిన నాలుగు నెలలకే శ్రీనివాస నాయక్‌పై చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఉన్న వెంకట చలపతిను ఆలూరు సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



శ్రీనివాస నాయక్

నందికొట్కూరు స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌పైనా చర్యలు

నందికొట్కూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణ నందికొట్కూరు పట్టణ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ప్రతాప్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా ఎస్బీలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ప్రతాప్‌పై సొంత పోలీసు శాఖతోపాటు నియోజకవర్గ నాయకుల నుంచి పలు ఫిర్యాదులు ఎస్పీకి వెళ్లడంతో ఆయన విచారించి వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

ఓర్వకల్లులో డ్రోన్ హబ్‌కు
300 ఎకరాలు

స్థలాలను పరిశీలించిన డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ కె.దినేష్ కుమార్



పాలకొలనులో మ్యాప్‌ను పరిశీలిస్తున్న డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ

ఓర్వకల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో 300 ఎకరాల స్థలంలో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ కె.దినేష్ కుమార్ వెల్లడించారు. ఓర్వకల్లు ప్రాంతాన్ని డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కేబినెట్ సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో డ్రోన్ హబ్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాలను దినేష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆయనతో పాటు జీఎం జి.సురేష్, పి. ప్రవీణ్ కుమార్, మణికుమార్, డీఎఫ్ఐలు స్విట్లా సిరిన్‌జోషీ డ్రోన్ ఆచార్య శుభంగి జోహాన్ రాజజనార్దన్, ఆర్డీవో సందీప్ కుమార్‌తో పాటు పది మంది సిబ్బంది ప్రభుత్వ పొలాలను పరిశీలించారు. ఓర్వకల్లు, పాలకొలను, కొమరోలు, చింతపల్లె, సోమయాజులపల్లెలో అనువైన భూములను స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. చింతపల్లె గ్రామం వద్ద పాలకొలను, కొమరోలు వద్ద కొన్ని భూములు డ్రోన్ హబ్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ భూమి 600 ఎకరాలు ఉందని, అందులో 400 ఎకరాలు డ్రోన్ ఏర్పాటుకు భూములు అనుకూలంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. రెండు గ్రామాల మధ్య అధికారులతో సీఎండీ దినేష్ కుమార్ మ్యాప్‌ను పరిశీలించారు. రూ.1000 కోట్ల పెట్టుబడులతో డ్రోన్ పాలసీ-2024, 2029 ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించిందన్నారు. డ్రోన్ రంగంలో 40వేల ఉద్యోగాల కల్పన రూ.3వేల కోట్ల రాబడి లక్ష్యంగా కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సాధ్యమైనంత త్వరగా స్థల సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థల సేకరణలో ఎలాంటి అలసత్వం లేకుండా అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ పాణ్యం వెంకటేశ్వర్లు, సర్వేయర్ శంకర్‌శర్మ, సర్పంచ్‌లు చదువుల సుజాతమ్మ, వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకులు పాలకొలను చదువుల సుధాకర్ రెడ్డి, కొమరోలు, పాలకొలను వీఆర్వోలు, గ్రామ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్టీజీఎస్ కేంద్రం పరిశీలన

రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ జిల్లా సెంటర్ నిర్మాణ పనులను ఆర్టీజీఎస్ సీఈఓ కె.దినేష్ కుమార్ పరిశీలించారు. ఆర్టీజీఎస్ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ కలెక్టరేట్‌కు అనుసంధానంగా ఒక ప్రత్యేక ఆర్టీజీఎస్ జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. దీంతో ఆయా జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఈవెంట్స్, సంఘటనలను రియల్ టైమ్‌లో పరిశీలించి సమీక్షించే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఏపీ ఫైబర్ నెట్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఫైబర్ నెట్ విస్తరణ పనులను అధికారులతో సమీక్ష నిర్వహించారు.

దైవిక చిహ్నం.. ధార్మిక మార్గం


- 105 ఏళ్ల కోల్స్ చర్చి
- అప్పట్లోనే నిర్మాణ వ్యయం రూ.60 వేలు
- నేటికీ చెక్కు చెదరని చారిత్రాత్మక కట్టడం



ఆధ్యాత్మికం

కర్నూలు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

ఆకాశ హర్మ్యాన్ని అంటే వంద అడుగుల ఎత్తైన శిఖరం... శిఖర భాగంలో కాలచక్రాన్ని చూపే గడియారం... గోదిక్ నమూనాలో సుందరంగా కనిపించే ఆర్చ్‌లు.. అందమైన రోజ్‌వుడ్ చెక్కలతో చేసిన కిటికీలు... ప్రత్యేకమైన గదులతో ఆకర్షణీయంగా కనిపించే ఈ క్రైస్తవ ప్రార్థనా మందిరమే కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి. కర్నూలు నగరంలో ప్రత్యేక కట్టడంగా కనిపించే ఈ దైవిక చిహ్నం, అనునిత్యం ధార్మిక భావనలు వెదజల్లుతూ క్రైస్తవులకు ఆరాధ్య, ఆధ్యాత్మిక కేంద్రంగా అలరాలుతోంది. 105 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ చర్చిని అమెరికాకు చెందిన అక్కర్‌మన్ కోల్స్ నిర్మించారు. అందుకే ఆయన పేరు స్ఫురించేలా ఈ మందిరానికి కోల్స్ చర్చిగా నామకరణం చేశారు.



రెవ. డాక్టర్ విలియం ఆర్థర్ స్టాంటన్ (ఫైల్)


నిర్మాణానికి రూ.60వేలు

అమెరికా బాప్టిస్టు మిషనరీకి చెందిన రెవ. విలియం ఆర్థర్ స్టాంటన్ 1918కి పూర్వం జిల్లాలో మిషనరీ సేవలు అందించేందుకు వచ్చారు. ఇక్కడ క్రైస్తవ విశ్వాసులు ఆరాధించుకునేందుకు, క్రీస్తు సువార్త పరిచర్యకు కేంద్రం ఉండాలని ఒక చర్చి స్థాపించేందుకు అమెరికాలో వైద్యవృత్తిలో ఉన్న మిత్రుడు డాక్టర్ అక్కర్‌మన్ కోల్స్‌ను సంప్రదించాడు. దీంతో కోల్స్ పాఠశాలకు ఎదురుగా, ప్రధాన రహదారిలోని స్థలాన్ని ఆనాడు రూ.4500లకు స్టాంటన్ దొర కొనుగోలు చేశారు. అనేక మంది సర్వమతస్తుల మధ్య 1917 సెప్టెంబరు 3న నాటి సీనియర్ మిషనరీ అయిన డాక్టర్ జాన్ న్యూకూంబ్‌చేత పునాదిరాయి వేయించారు. ప్రపంచ యుద్ధం కారణంగా చర్చి నిర్మాణం నిదానంగా జరిగి 1919 సెప్టెంబరు 21న నాటికి పూర్తయింది. కర్నూలు సున్నపురాయితో నిర్మించిన ఈ ఆలయ నిర్మాణానిక రూ.60 వేలు ఖర్చు అయింది. ఈ చర్చిలో శిఖర భాగంలో ఆనాడు అమెరికా నుంచీ కోల్స్ దొర పంపించిన గడియారం, గుడి గంట నేటికీ వినియోగంలో ఉండటం విశేషం.





నిరంతర సేవా కార్యక్రమాలకు నిలయం



కోల్స్ చర్చి నిరంతర సేవా కార్యక్రమాలకు నిలయంగా ఉంటుంది. ఇక్కడ యువతకు యూత్ వింగ్, మహిళలకు విమన్స్ వింగ్, పిల్లల కోసం సండే స్కూల్ వంటివి కొనసాగుతున్నాయి. అలాగే ప్రతీవారం ఉచిత వైద్య పరీక్షల కేంద్రం అందుబాటులో ఉంటుంది. వివిధ గ్రామాలలోని చర్చిలకు ఆర్థిక సహాయంతోపాటూ, కొత్త చర్చిల నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేయడం, అక్కడ పాస్టర్లను నియమించి వారికి వేతనాలు చెల్లించడం చేస్తున్నాం.

\- అబ్రహం లింకన్, అధ్యక్షుడు, కోల్స్ చర్చి

కోల్స్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు



కోల్స్ చర్చి నిర్మాణ దాత కోల్స్ పేరున కోల్స్ ఫౌండేషన్ సంస్థ స్థాపించి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. రాక్‌వుడ్, ఈసీఎం, కోల్స్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి, వాటర్ బాటిళ్లు, చలికాలంలో స్వెట్టర్లు, పేద మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు వంటివి అందించడం ఏటా కొనసాగుతూ ఉంటాయి. కోల్స్ మహనీయుని స్ఫూర్తిగా, కోల్స్ చర్చి అనుబంధంగా ఈ సంస్థ సేవల్లో ముందుంటోంది.

\- పి.విజయ్‌కుమార్, అధ్యక్షుడు, కోల్స్ ఫౌండేషన్ సంస్థ

అడవిని కాపాడిన అమరులు

'యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం'

దేవనకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేఖర్, టీడీపీ నాయకులు మాలిక్‌బాషా, వీరేష్, మల్లికార్జునగౌడ్ , సీపీఐ మండల కార్యదర్శి నర్సారావు, కాంగ్రెస్ నాయకులు మహేంద్ర, అన్నారు. శనివారం దేవనకొండలోని మూగితాత ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. యురేనియం అలజడితో ప్రజలు భయంభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కలెక్టర్ ప్రకటనలో స్పష్టత లేదన్నారు. మండలానికి వచ్చి ప్రజలకు తవ్వకాల అనుమతులను రద్దు చేశామని చెప్పాలన్నారు. యురేనియం అనుమతులు రద్దు అయ్యేంతవరకు ప్రజలను సమీకరించి మండలంలో ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చెల్లెలచెలిమల సర్పంచ్ చిన్నరామప్ప, సీపీఎం నాయకులు యూసఫ్‌బాషా, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు

- విధి నిర్వహణలో అశువులు బాసిన ఫారెస్టు ఉద్యోగులు
- నేడు జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం



అమరుల స్మారక స్థూపానికి అటవీ అధికారుల నివాళి


ఆత్మకూరు, నవంబరు 9:



ఒకప్పుడు అటవీ ఉద్యోగులకు ఆయుధాలు ఉండేవికావు. దీంతో విధుల నిర్వహణ కత్తిమీద సాములా ఉండేది. కానీ నాలుగేళ్ల క్రితం అటవీశాఖలో పనిచేసే రేంజర్, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవో స్థాయి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆయుధాలు ఇచ్చింది. దీంతో కాస్త ఊరట లభించింది. ఆయుధాలు చేతిలో లేనప్పుడు పలువురు అటవీ ఉద్యోగులు స్మగ్లర్ల చేతుల్లో హతులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కోటిపల్లికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ కర్నాటక క్యాడర్‌లో విధులు నిర్వహిస్తూ అక్రమ కలప నివారణ, వన్యప్రాణుల వేట కట్టడికి నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. అంతటితో కాకుండా అటవీ సమీప గ్రామాల్లో ఆసుపత్రులు, పాఠశాలలు, రహదారులు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకై చొరవ తీసుకోవడంతో ప్రజల్లో మంచి గుర్తింపు ఉండేంది. ఈ క్రమంలోనే తమ స్మగ్లింగ్‌కు ఐఎఫ్ఐ పందిల్లపల్లి శ్రీనివాస్‌గా అడ్డుగా ఉన్నారని 1991, నవంబరు 10వ తేదిన స్మగ్లర్ వీరప్పన్ తన అనుచరులతో కలిసి ఆయన్ని హతమార్చారు. అయితే అటవీ రక్షణకై విశేష సేవలు అందించి అశువులు బాసిన పందిళ్లపల్లి శ్రీనివాస్‌ను స్మరిస్తూ.. 1992 నుంచి నవంబర్ 10వ తేదిన జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మరణాంతరం 1992లో కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డుతో ఆయనను గౌరవించింది.

వనం-
మనం నేటి సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన నినాదం. అడవులు లేకుంటే మానవాళి లేదు. పర్యావరణం లేదు. అడవుల రక్షణలో సంరక్షణలో ప్రతిఒక్కరిని భాగస్వాముల్ని చేయాలన్న సంకల్పంతో స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ప్రత్యేకించి వనాల, వన్యప్రాణుల సంరక్షణలో అటవీశాఖ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అడవితల్లి రక్షణకై ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించినవారి అమరత్వాన్ని ప్రతి ఏటా నవంబర్ 10న గుర్తు చేసుకుంటారు.

జిల్లాలో అమరుడైన రేంజర్ రామయ్య



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 21 మంది అటవీ ఉద్యోగులు విధినిర్వహణలో అమరులయ్యారు. ఆత్మకూరు అటవీ డివిజన్‌కు చెందిన బైర్లూటి రేంజ్ అధికారి రామయ్య 1994 జూన్ 20వ తేదిన మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించడంతో ఆయన్ని కాల్చిచంపినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పలు సందర్భాల్లో అటవీ సిబ్బందిపై దాడులు చేసిన సంఘటనలు లేకపోలేదు. కలప స్మగ్లర్లను అదుపులోకి తీసుకునే క్రమంలో అనేకమార్లు పొలపర్లు రాళ్లదాడులకు పాల్పడ్డారు. అయితే అప్పట్లో అటవీ అధికారుల చేతుల్లో ఆయుధాలు లేకపోవడంతో ఈ సంఘటనలన్ని జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం అటవీ అధికారులకు ఆయుధాలు ఇవ్వడంతో విధుల్లో రాణించేందుకు అవకాశం వుంది. కాగా రేంజర్ రామయ్య ప్రాణ త్యాగానికి గుర్తుగా ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటిలో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం వద్ద ప్రతి ఏటా అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా ఆయనకు నివాళ్లు అర్పిస్తారు.

అటవీ అమరవీరుల త్యాగం మరువలేనిది



అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి. విధి నిర్వహణలో అశువులుబాసిన అటవీ ఉద్యోగుల సేవలు మాకు ఆదర్శం. అటవీ రక్షణకై విధులు నిర్వహించే ఉద్యోగులకు ఆయుధాలను సమకూర్చడం సంతోషదాయకం. అలాగే అటవీ ఉద్యోగుల విధి నిర్వహణకు మరిన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలి.

\- సయ్యద్ మగ్బూల్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్



కుడా చైర్మన్‌గా సోమిశెట్టి

5వ పేజీ తరువాయి

ఉమ్మడి జిల్లాలో నామినేటెడ్ పదవులు దక్కించుకున్న వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కురుబ/కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పెద్దహరివాణం దేవేంద్రప్ప, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్‌లకు సామాజికవర్గం కలసి వచ్చింది. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ పత్తికొండ సమితి దివంగత మాజీ అధ్యక్షుడు కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుమార్తే. ఆయన మరణాంతరం తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. ఆస్పరి జడ్పీటీసీగా పని చేశారు. గత ఎన్నికల్లో వాల్మీకి కోటాలో ఆలూరు వైసీపీ టికెట్ ఆశించి నాటి సీఎం జగన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అయితే.. జగన్ మొండి చేయి చూపడంతో ఆమే భర్త దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడుతో కలసి మళ్లీ టీడీపీలో చేరారు. గుర్తించిన సీఎం చంద్రబాబు వాల్మీకి-బోయ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. కురబ సామాజికవర్గానికి చెందిన దేవేంద్రప్ప మొదటి నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. పెద్దహరివాణం సర్పంచిగా, ఆదోని మార్కెట్ యార్డు చైర్మన్‌గా పని చేశారు. గత ఎన్నికల ముందు ఆదోని టీడీపీ టికెట్ ఆశించారు. ఆదోని డివిజన్ ప్రాంతంలో కురబలు అధికంగా ఉన్నారు. దీంతో ఆయనకు కురబ-కురవ కార్పొరేషన్ పదవి దక్కింది. బీజేపీ కోటాలో ఆదోనికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది సావిత్రిని రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. చదువుకునే రోజుల్లో ఏబీవీపీ విద్యార్థి సంఘంలో పనిచేశారు. ఆ తర్వాత ఆర్ఎస్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. కాగా సావిత్రి భర్త నాగరాజు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. ఎస్టీయూ రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. నంద్యాల పట్టణంలో ముస్లీం మైనార్టీలు అధికంగా ఉన్నారు. ఆ సామాజికవర్గానికి చెందిన ముస్తాక్ అహ్మద్‌కు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చారు. నామినేటెడ్ పదవులు దక్కిన నేతలను అభిమానులు, కార్యకర్తలు కలసి అభినందనలు తెలియజేశారు.

ఆ ఇద్దరు నేతలకు నిరాశ



తిక్కారెడ్డి




మీనాక్షి నాయుడు

టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డిలను టీడీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, పి.తిక్కారెడ్డిలు దీటుగా ఎదుర్కొన్నారు. కార్యకర్తలకు అండగా నిలిచారు. ఆదోనిలో నిర్వహించిన బాదుడే బాదుడు రోడ్ షో దిగ్విజయం చేసి మీనాక్షినాయుడు రాష్ట్రంలోనే టీడీపీ శ్రేణుల్లో సరికొత్త నూతనోత్తేజం తీసుకొచ్చారని అధినేత చంద్రబాబు మహానాడు వేదికగానే ప్రశంసించారు. యువగళం పాదయాత్ర ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో దిగ్విజయం చేయడం, అధినేత అక్రమ అరెస్టుతో 53 రోజులు అక్రమంగా జైలు నిర్బంధంలో ఉంటే వివిధ రూపాల్లో అందోళన, నిరసనలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి వారి కుటుంబ సభ్యుల కృషి ఎంతో ఉంది. గత ఎన్నికల్లో మరోసారి ఆయా నియోజకవర్గాల్లో వారే పోటీ చేస్తారని అధిష్టానం సంకేతాలు కూడా ఇచ్చింది. అయితే పొత్తుల్లో భాగంగా కె.మీనాక్షినాయుడు ఆదోని టికెట్, సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రాలయం టికెట్ తిక్కారెడ్డి త్యాగం చేయాల్సి వచ్చింది. 'వీరి రాజకీయ భవిషత్తు నాది.. అధికారం చేపట్టగానే తొలి జాబితాలోనే నామినేటెడ్ పదవులు ఇస్తా'నని అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. జిల్లా పార్టీలోనే అత్యంత సీనియర్ నాయకుడైన కె.మీనాక్షినాయుడుకు సముచిత స్థానం కల్పిస్తానని ఎన్నికల ముందు ఆలూరు ప్రజాగళం ప్రచార సభకు హాజరైన చంద్రబాబు బస్సులో దాదాపు అరగంటకు పైగా చర్చించి స్పష్టమైన హామీ ఇచ్చారు. నామినేటెడ్ పదవులు రెండు జాబితాలు విడుదల చేసినా సీట్లు త్యాగం చేసిన వీరిద్దరికి నిరాశే మిగిలింది.

పర్యాటక రంగానికి శ్రీశైలం అనుకూలం

● సీప్లేన్ డెమో ప్రారంభించిన సీఎం చంద్రబాబు ● పర్యాటక అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



'పర్యాటక రంగానికి శ్రీశైలం అనుకూల ప్రదేశం. ఇక్కడి తుమ్మలబయలులో టైగర్ సఫారికి అవకాశం ఉంది. వన్యప్రాణులు, పులులు, చిరుతలకు నల్లమల అభయారణ్యం సురక్షిత ప్రదేశం. ఇక శ్రీశైలం డ్యాం ఒక అద్భుతం. డ్యాం గేట్లు ఎత్తినప్పుడు ఆ దృశ్యాలను చూడటానికి ప్రజలు ఎక్కువ మంది వస్తుంటారు. ఇక్కడి ప్రసిద్ధి చెందిన అక్కమహాదేవి గుహల్లో ట్రెక్కింగ్, ధ్యానం చేసుకోవడానికి అనువుగా ఉంటుంది. ఇష్ట కామేశ్వరి దేవి, సాక్షి గణపతి క్షేత్రాలు కూడా ఉన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తాం.'

\- సీఎం చంద్రబాబు నాయుడు

శ్రీశైలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాంతం తిరుమల తిరుపతి పవిత్ర పుణ్యక్షేత్రంలాగే పచ్చని ప్రకృతితో నిండి ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దోర్నాల నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు ఉంది కాబట్టి టూరిజాన్ని అభివృద్ధి పరిచేలా అనేక రకాల కార్యక్రమాలను చేపట్టవచ్చన్నారు. అలాగే తుమ్మలబయలులో నల్లమల జంగిల్ సఫారీ, టైగర్ రిజర్వ్‌లో టైగర్ సఫారి చేయవచ్చన్నారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ఓ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామన్నారు. కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా పనులు చేపడతామన్నారు.

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం సీఎం నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'సీ మీట్స్ స్కై' పేరుతో చేపట్టిన విజయవాడ-శ్రీశైలం మధ్య సీప్లేన్ సర్వీసును శనివారం ఉదయం విజయవాడ పున్నమి ఘాట్ వద్ద లాంఛనంగా ప్రారంభించారు. తరువాత సీప్లేన్ ద్వారా శ్రీశైలం పాతాళగంగ ల్యాండింగ్ పాయింట్‌కు వచ్చారు. అక్కడి నుంచి రోప్ వే ద్వారా ఎంట్రీ పాయింట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా స్వామి, అమ్మవార్ల ప్రధానాలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్దకు చేరుకున్నారు. దర్శనార్థం ప్రధానాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనరు ఎస్. సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు బ్యాటరీ వాహనంలో ఆలయ రాజగోపురానికి చేరుకోగా ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ఆయన స్వామివారి ఆలయ ప్రాంగణంలోని రత్న గర్భగణపతి స్వామిని



శ్రీశైలం దేవస్థానంలో చంద్రబాబు పూజలు

దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారి దర్శనానంతం సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. ఆ తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఎంపీలు, బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, జయనాగేశ్వరరెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, శ్రీశైలం ఆలయం ఇన్‌చార్జి ఈవో ఇ.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం బ్యాక్ వాటర్‌పై సీ ప్లేన్



ఆలయ అధికారులు, అర్చకులతో సీఎం చంద్రబాబు నాయుడు

మల్లన్న సేవలో చంద్రన్న

● శ్రీశైలంలో సీఎంకు ఘన స్వాగతం
● స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న చంద్రబాబు

శ్రీశైలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం సీఎం నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల ప్రధానాలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనరు ఎస్. సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు బ్యాటరీ వాహనంలో ఆలయ రాజగోపురానికి చేరుకోగా ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ఆయన స్వామివారి ఆలయ ప్రాంగణంలోని రత్న గర్భగణపతి స్వామిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారి దర్శనానంతం సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. ఆ తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దర్శన అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో చంద్రబాబును అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందించారు. సీఎం చంద్రబాబు వెంట రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు ఉన్నారు.



చంద్రబాబుతో బుడ్డా



పాతాళగంగ వద్దకు చేరుకున్న సీ ప్లేన్



స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న చంద్రబాబు



పాతాళగంగకు వెళ్లే మెట్ల వద్ద చంద్రబాబు

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

ఓర్వకల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు రెడ్డిపోగు సంతోష్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయ ఆనంద్ ఆటోను అతివేగంగా నడిపి రోడ్డు దాటున్న లొద్దిపల్లె గ్రామానికి చెందిన బాలుడు సంతోష్‌ను ఢీకొంది. దీంతో బాలుడు రక్తగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని పశ్చిమ బెంగాల్ వాసి..

నందికొట్కూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సందీప్ టక్కీ(30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన టక్కీ 340సి జాతీయర రహదారి పనులు చేసేందుకు గత కొన్ని రోజుల క్రితం నందికొట్కూరుకు వచ్చాడు. శనివారం ఉదయం మార్కెట్ యార్డు వద్ద కేజీ రోడ్డుపై నడిచి వెళ్తున్న సందీప్ టక్కీని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సందీప్ శరీరం రెండు బాగాలుగా విడిపోయింది. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సందీప్ స్నేహితుడు ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రామచంద్రుడు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బేతంచెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్ గ్రామ సమీపంలో మోటారు బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రమేష్ నాయక్ (25) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రమేష్ నాయక్ గ్రామంలో టీస్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవలే రమేష్ నాయక్ కొత్త బైక్ కొన్నాడు. మద్దిలేటి నరసింహస్వామి దగ్గరికి వెళ్లి పూజలు చేయించుకుని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా.. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య దేవిబాయి, ఏడాది కూతురు ఉన్నారు. రమేష్ నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. భార్య దేవిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు.



మృతి చెందిన రమేష్ నాయక్

గూడ్స్ ఢీకొని యువకుడు..

బేతంచెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.కొట్టాల రైల్వే గేటు సమీపంలో శనివారం గూడ్స్ రైలు ఢీకొని శ్రీధర్ ఆచారి (19) అనే యువకుడు దుర్మరణం చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వెంకట రమణయ్య ఆచారి, ఇంద్రావతి దంపతులకు చెందిన ఒకే ఒక్క కుమారుడు శ్రీధర్ ఆచారి బేతంచెర్ల పద్మావతి ఐటీఐ కాలేజీలో చదివేవాడు. మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండో సంవత్సరం మానేసి ఇంటి దగ్గరే ఉన్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లారు. శ్రీధర్ ఆచారి బేతంచెర్లకు వచ్చాడు. హెచ్.కొట్టాల రైల్వే గేటు నుంచి డోన్ వైపు రైల్వే ట్రాక్ వెంబడి వెళ్తుండగా నంద్యాల నుంచి డోన్ వైపు వెళ్లే గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు కేసు నమోదు చేసి మృతదేహాన్ని డోన్ రైల్వే ఆసుపత్రికి తరలించామని రైల్వే ఎస్ఐ లక్ష్మన్న నాయక్ తెలిపారు.



శ్రీధర్ ఆచారి (ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..

గోనెగండ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని శనివారం ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. బెళగల్ మం డలం యనగండ్ల గ్రామా నికి చెందిన తెలుగు వెంకటేష్(49)కు భార్య అంజినమ్మ, ఇద్దరు కుతూళ్లు, కుమారుడు ఉన్నారు. దేవనకొండ మండలం కోటకొండ గ్రామంలో ఓ యజమాని దగ్గర మామిడి తోటలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి స్వగ్రామమైన యనగండ్లకు వెళ్లి తిరిగి కోటకొండకు బైక్‌పై బయలు దేరాడు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్ రోడ్డు దాటుతుండగా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో బస్సు ఢీకొట్టింది. దీంతో తెలుగు వెంకటేష్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలై నోరు, చెవుల నుంచి తీవ్ర రక్త స్రావం జరిగింది. 108లో కోడుమూరుకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ గుగ్గిళ్ల రమాణారెడ్డి పారిపోయారు. మృతుడి కుమారుడు బడేసాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

30 ఏళ్ల తరువాత సొంతూరికి..

• మతిస్థిమితం లేక తప్పిపోయి నేపాల్ చేరిన ఇమ్మానుయేల్

ఎమ్మిగనూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక 30 ఏళ్ల క్రితం కన్నవారికి దూరమయ్యాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ నేపాల్‌కు చేరుకున్నాడు. అక్కడ మానవీయ సేవా కేంద్ర నిర్వాహకులు చేరదీశారు. ఆశ్రమంలోనే ఉంచుకొని వైద్యం చేయించారు. అతను ఎవరో ఎక్కడి నుంచి వచ్చాడో తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన వాడిగా గుర్తించి పట్టణంలో ఉన్న వేదాస్ స్వచ్ఛంద నిర్వాహకులు సునీల్ కుమార్‌తో మాట్లాడి శనివారం ఎమ్మిగనూరుకు తీసుకొచ్చారు. అయితే కుటుంబ సభ్యులు పట్టణంలో ఎవరూ లేకపోవటంతో వేదాస్ నిర్వాహకులు సునీల్ కుమార్‌కు అప్పగించారు. పట్టణంలోని ఎంబీ యోరుషలేం చర్చికి 1982-90లో పాస్టర్‌గా పని చేసిన రెవరెండ్ ఆదాంకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో చిన్న వాడు ఇమ్మానియేల్. ఈయనకు మతిస్థిమితం లేకపోవటంతో 30 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కాలగమనంలో పాస్టర్ ఆదాం, ముగ్గురు కుమారులు, కుమార్తె మృతి చెందారు. అయితే ఇమ్మానుయేల్ నేపాల్ రాజధాని కాట్మాండు చేరుకున్నాడు. అక్కడ మానవీయ సేవాశ్రమ నిర్వాహకులు చేరదీశారు. ఐదేళ్లుగా వారి దగ్గరే ఉంచుకొని వైద్యం చేయించి వివరాలను తెలుసు కున్నారు. సొంత ఊరు ఎమ్మిగనూరు కావటంతో పట్టణంలోని వేదాస్ స్వచ్ఛంద సేవాశ్రమం నిర్వాహకులు సునీల్ కుమార్‌తో మాట్లాడి వివరాలు చెప్పారు. ఎమ్మిగనూరు వాసిగా గుర్తించిన ఆశ్రమ ప్రతినిధులు సుమన్‌తోపాటు మరొకరు ఇమ్మానుయేల్‌ను శనివారం ఎమ్మిగనూరుకు తీసుకొచ్చారు. అయితే వారి బంధువులు ఎవరూ లేకపోవటంతో వేదాస్ స్వచ్ఛంద సేవాశ్రమంలో ఉంచుకున్నారు. సునీల్ స్థానికుల ద్వారా ఇమ్మానుయేల్ బంధువుల వివరాలు తెలుసుకున్నాడు. అక్క విక్టోరియా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి గుర్తుపట్టారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం తప్పిపోయిన వ్యక్తి తిరిగి రావటంతో వారి కుటుంబ సభ్యులు ఆనందబాష్పాలు రాల్చారు. నేపాల్ నుంచి ఇమ్మానుయేల్‌ను ఎమ్మిగనూరుకు తీసుకొచ్చిన ప్రతినిధులకు ఎంబీ చర్చి, వేదాస్ స్వచ్ఛంద సేవాశ్రమం నిర్వాహకులు రూ. 25 వేలు అందజేశారు. చర్చి కార్యదర్శి భాస్కర్, బాబు, తిమ్మరాజు, పాల్‌రాజు, ఆనంద్‌రాజు, పాస్టర్ డేవిడ్, సెక్రటరీ ప్రభాకర్, శాంతిరాజులు పాల్గొన్నారు.



వేదాస్ నిర్వాహకులకు ఇమ్మానుయేల్‌ను అప్పగిస్తున్న ప్రతినిధులు

గర్భాశయ క్యాన్సర్‌కు హెచ్‌పీవీ వ్యాక్సిన్

• త్వరలో ఇమ్యూనైజేషన్ తరహా వ్యాక్సిన్
• తల్లుల మరణాల నివారణకు కృషి చేయాలి
• కర్నూలులో ప్రారంభమైన జాతీయ గైనిక్ వైద్యుల సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

కర్నూలు హస్పిటల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా మహిళలకు ప్రభుత్వం ఇమ్యూనైజేషన్ తరహాలో హ్యూమన్ పాపిలోమా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు జాతీయ గైనిక్ సొసైటీ కార్యదర్శి డా. మాధురీ పటేల్ అన్నారు. శనివారం రాత్రి మౌర్యఇన్ హోటల్‌లో జాతీయ గైనిక్ వైద్యుల సదస్సును ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు, అనంతపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. మాణిక్యరావు, జాతీయ ఉపాధ్యక్షురాలు డా.షర్మిళ అయ్యావు, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా.ఎస్. వెంకటరమణ, సెక్రటరీ డా. రాధాలక్ష్మి, గైనిక్ హెచ్‌వోడీ డా. శ్రీలక్ష్మితో ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. డా. మాధురీపటేల్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశంలో సర్వేకల్ క్యాన్సర్‌తో అధిక సంఖ్యలో మహిళలు మరణిస్తున్నారని, అందువల్ల 9 నుంచి 48 సంవత్సరాల వయస్సు ఉన్న ఆడ పిల్లలు, మహిళలు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను తీసుకోవాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టి నరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు జాతీయ గైనిక్ వైద్యుల సదస్సు జరగడం అభినందనీయమని అన్నారు.



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి మాధురి పటేల్



నిందితులను చూపుతున్న పోలీసులు

ఇద్దరు దొంగల అరెస్టు

• బంగారు, టీవీ, నగదు స్వాధీనం

కోవెలకుంట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు, టీవీ, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హనుమంత నాయక్ తెలిపారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామానికి చెందిన శ్రీరాముల విజయభాస్కర్, మౌలాలి అనే ఇద్దరు వ్యక్తులు కంపమల్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో దొంగతనాలు చేశారు. పొలం పనులకు వెళ్లిన వాళ్ల ఇండ్ల తాళాలు పగలగొట్టి బంగారు, టీవీ, నగదు ఎత్తుకెళ్లారు. ఇలా గ్రామంలోని నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు చేశారు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామంలో కూడా రెండిళ్లలో దొంగతనాలు చేసి కొంత నగదు ఎత్తుకెళ్లారు. సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి నేతృత్వంలో పోలీసులు శ్రీరాముల విజయభాస్కర్, మౌలాలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 3.5 తులాల బంగారం, 65 వేల నగదు, ఐదు జతల వెండి పట్టీలు, ఒక టీవీ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు విలేఖరుల సమావేశంలో తెలిపారు. వీరిని మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.



నిరుపయోగంగా ప్రభుత్వ భూములు

● కంపచెట్లతో నిండిన ఖాళీ స్థలాలు ● దోమల నిలయంగా మారిన వైనం ● వినియోగంలోకి తేవాలని ప్రజల వినతి



నిరుపయోగంగా మారిన దేవదాయ శాఖ స్థలం

పాణ్యం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ స్థలాలు నిరుపయోగంగా మారాయి. ఎన్నో ఏళ్లుగా వాటిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పాణ్యం ఎస్సార్బీసీ పక్కన ఉన్న ఐదెకరాల దేవదాయ శాఖకు చెందిన భూమి నిరుపయోగంగా ఉంది. ఈ స్థలంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కళ్యాణ మండపం, వీరనారాయణ స్వామి ఆలయం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో ఈ స్థలంలో ప్రైవేటు పాఠశాల కొనసాగేది. కోర్టు ఆదేశాలతో పాఠశాల తొలగించారు. అయితే అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంది. ప్రస్తుతం ఈ స్థలం కంపచెట్లతో నిండి నీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. స్థల ంలో కంపచెట్లు తొలగించా లని, నీరు తొలగించాలని పలుమార్లు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరినా చర్యలు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. నీరు, కంప చెట్లతో దోమలు వ్యాపించి వ్యాధుల బారిన పడుతున్నామని అయ్యపురెడ్డి కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బనగానపల్లె రహదారిలో రోడ్డు పక్కన ఉన్న 4. 05 ఎకరాల రోడ్డు భవనాల శాఖకు చెందిన స్థలం నిరుపయోగంగా ఉంది. ఈ స్థలంలోని విశ్రాంత భవనం శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. 2001లో ఈ స్థలంలోని ఎకరా స్థలాన్ని ఆర్టీసీకి కేటాయించి బస్టాండు నిర్మాణం చేపట్టారు. గత పదేళ్ల క్రితం బస్టాండు నాలుగురోడ్ల నిర్మాణంతో తొలగించడంతో ఈ స్థలం నిరుపయోగంగా మారి ఆక్రమణలకు గురైంది. కొందరు అక్రమార్కులు ఈ స్థలాలను బాడుగలకు ఇచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



కంప చెట్ల మధ్య ఆర్ అండ్ బి స్థలం

వేంకటేశ్వర స్వామికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామికి ఉదయం విష్ణుసహస్ర నామం, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణహారాలతో, పుష్పాహారాలు, తులసీమాలతో ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామికి మహా మంగళహారతి, నవ నక్షహారతులు, మహామంగళ హారతి ఇచ్చారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్య క్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు పార్థసారధికృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూరులో ప్రత్యక్షమైన అఘోరీ

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన మహిళా అఘోరీ శనివారం రాత్రి ఆత్మకూరులో ప్రత్యక్షమయ్యారు. కర్నూలు నుంచి శ్రీశైలానికి స్వయంగా కారు డ్రైవింగ్ చేస్తూ వెళ్లే క్రమంలో ఆత్మ కూరులోని నంద్యాల టర్నింగ్ సమీపంలో ట్రాఫిక్ జామ్‌తో ఆమె వాహనం నిలిపివేయడంతో ఒక్కసారిగా యువకులు చుట్టుముట్టి కేకలు వేస్తూ, సెల్‌ఫోన్లలో ఫొటోలు తీస్తూ హంగామా చేశారు. దీంతో అఘోరి కారు అద్దాన్ని కిందికి దించి వారందరిని పక్కకు జరగాలని సూచించడంతో వారు అఘోరికి దారివ్వగానే శ్రీశైలానికి బయలుదేరారు.

నేడు హైందవ శంఖారావం

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మంటపంలో ఆదివారం నిర్వహించే హైందవ శంఖారావం సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు గరుడాద్రి సుదర్శన్, శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం మహాసభను పురస్కరించుకుని ముందస్తుగా తాలుకా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'అమరుల ఆశయాలను కొనసాగిద్దాం'

వెలుగోడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు అన్నారు. చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా వెలుగోడు పట్టణంలోని పుల్లారెడ్డి స్థూపం వద్ద పలువురు నేతలు నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి నరసింహులు, నాయకులు ఖాజామొహిద్దీన్, అరుణ్‌కుమార్, గోపాల్, ఆనంద్, శివ, వెంకటేశ్వర్లు, కృష్ణ, సూర్యనారాయణ రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని సమీకృత వ్యవసాయ ప్రయోగశాలలో వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో అక్టోబరు 10వ తేదిన మరణించిన వెంకటనారాయణ కుటుంబానికి ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ తరుపున శనివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, స్థానిక వ్యవసాయ విస్తరణాధికారులు కలిసి రూ.2 లక్షల సాయాన్ని వెంకటనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఏఈవోలు మహేష్, సతీష్, శివసాయి తదితరులు ఉన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

వెలుగోడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వెలుగోడు గుంతకందాల రహదారిలో పిల్లకాల్వ సమీపంలో తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో 'పగి లిన పైపులైన్.. తాగునీరు వృథా' అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురిత మైంది. దీంతో శనివారం అధికారులు స్పందించారు. వెంటనే పైపులైన్ మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టారు.

'రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలి'



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు

గడివేముల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు తక్షణమే ప్రభు త్వం నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజ నేయులు, జిల్లా నాయకులు రంగ నాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. మండలంలోని కొరపోలూరు గ్రామంలో ఆదివారం రైతుల వద్ద సంతకాలు సేకరించారు. వారు మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్ కరకట్ట తెగి 4 సంవత్సరాలు అవుతోందని, గత ప్రభుత్వం కరకట్ట మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే కలెక్టర్ కుంగిన కరకట్టను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అంద జేశారని అన్నారు. సీపీఐ నాయకులు రైతుల వద్దకు వెళ్లి సంతకాలు సేకరించి ముఖ్య మంత్రికి వినతి పత్రం అందజే స్తామని చెప్పారు. రైతు సంఘం నాయ కులు ఇబ్రహం, మాబాషా, రసూల్, ఇబ్రహీం, తిరుపాల్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

నందికొట్కూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి ఉమాదేవి దర్శనం చేసుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలంలో మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



ప్రేమకాంత్‌బాబు



సత్యనారాయణ హెగ్డే

నంద్యాల రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని పుసులూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గత నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు ప్రేమకాంత్‌బాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యాబోధనలో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు కొనసాగిస్తున్నారు. 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. 2017 లో శిరివెళ్ల మండలం ఖాదరబాదర గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలో అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

వెలుగోడు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు, హెచ్‌ఎం సత్యనారాయణ హెగ్డే ఎంపికయ్యారు. శనివారం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఆయన పేరు ఉండడంతో సహచర ఉపాధ్యాయులు, తదితరులు అభినందిం చారు. 2009లో వంద శాతం ఫలితాలు సాధించడంతో 2010లో జిల్లా ఉత్తమ ఉపాధ్యా యుడిగా అవార్డుడు అందుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యుడిగా ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నంద్యాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగింది. కళాశాల 1960లో స్థాపితం కాగా కళాశాల మొదటి బ్యాచ్ 1963నుంచి ప్రస్తుత బ్యాచ్ 2023వరకు అన్ని బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు దాదాపు వెయ్యి మంది వరకు హాజరయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్థిరపడ్డ వారు ఈ వేడుకకు హాజరుకావడంతో కళాశాల ఆవరణలో పండుగవాతావరణం నెలకొంది. ఒకరినొకరు గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అధ్యాపకులను సన్మానిం చారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మరిన్ని మౌలిక వసతులు కల్పించి వారి అభ్యున్నతికి నిధులు సేకరించి చర్యలు చేపడతామని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాళ్లు, విశ్రాంత అధ్యాపకులు, ప్రస్తుత అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాముడు, ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

షేక్ ముస్తాక్ అహ్మద్ నియామకంపై హర్షం



ముసలిమడుగు గ్రామంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన షేక్ ముస్తాక్ అహ్మద్‌కు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించడంతో ఆ గ్రామ ముస్లీం మైనార్టీ నాయకులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ముస్తాక్ అహ్మద్ ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడారు. సీఎం చంద్రబాబు తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇవ్వడం పట్ల సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కూటమి నేతలందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, షఫీవుల్లా, రహీంఖాన్, సీఎండీ రఫీ, మన్సూర్ వలి, ముర్తుజావలి, షాహీద్ రఫీ, మన్సూర్ బాషా, జహరుల్లా, మహబూబ్ బాషా, అబ్దుల్ గఫూర్, కుర్దుస్‌బాషా, ఎం.యూనుస్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరాల పరిశీలన

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను శనివారం ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 9, 10, 23, 24 (శని, ఆదివారాలు) తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18ఏళ్లు పూర్తయ్యే యువత కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లకాలువ గ్రామ అటవీ శివారులో పోలీస్ సిబ్బంది మూకుమ్మడిగా సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టీ వద్ద 5 డ్రమ్ములలో నిల్వ ఉంచిన 750 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బట్టీ నిర్వాహకుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి



యర్రగుంట్లలో కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్వ హిందూపరిషత్ ప్రతినిధులు

శిరివెళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : దేశంలోని హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వైవీ రామయ్య కోరారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5, 2025న హైందవ శంఖారావం పేరుతో విజయవాడలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలను శనివారం విడుదల చేశారు. అనంతరం యర్రగుంట్ల గీతాశ్రమంలో క్షేత్ర సమావేశం నిర్వహించారు. ప్రార్థనా స్థలాలు, ఆస్తుల విషయంలో ఇతర మతాలకు స్వేచ్ఛనిస్తూ అత్యధిక వర్గానికి చెందిన హిందూ దేవాలయాలు ప్రభుత్వాల నియంత్రణలో ఉండడం సరికాదన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు కమ్మయ్య, రామాంజనేయులు, కమతం రాజశేఖర్‌రెడ్డి, కాశయ్య, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, సత్యంరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్లాక్ చానల్ షట్టర్ ధ్వంసం

రుద్రవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ ప్రధాన కాల్వ 19వ బ్లాక్ చానల్ తూము షట్టరును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని గంగ సిబ్బంది శనివారం తెలిపారు. ఆయకట్టు రైతులు సాగునీరు అందలేదని ఫిర్యాదు చేయడంతో 19వ బ్లాక్ ఛానెల్ షట్టరు తూము పరిశీలించామన్నారు. ఎక్స్‌కవేటర్‌తో షట్టరు ను ధ్వంసం చేశారన్నారు. సమీపంలోని గోడలు పగిలిపోయాయన్నారు. జాకీలు ఏర్పాటు చేసి మరమ్మతు చేస్తామని తెలిపారు.

డ్రిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవన పంటలు సాగు చేసిన రైతులు డ్రిప్ ఇరిగేషన్(సూక్ష్మ సేద్యం) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి ధరణి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ డ్రిప్ అవసరమైన రైతన్నలు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి, దరఖాస్తులు చేసుకుంటే సబ్సిడీ కింద ప్రభుత్వం డ్రిప్ అందజేస్తుందని అన్నారు.

బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయొద్దు



కోవెలకుంట్లలో మద్యం బాటిళ్లను చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుహాసిని, అధికారులు

కోవెలకుంట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైన్స్ దుకాణాల నుంచి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుహాసిని హెచ్చరించారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలో నిర్వహించిన తనిఖీల్లో ఎల్‌ఎం కాంపౌండులో ఓ బెల్టుషాపు నిర్వహిస్తున్న అచ్చమ్మ వద్ద నుంచి 16 ఓల్డ్ అడ్మిరల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు జిల్లాల పరిధిలోని వైన్‌షాపుల నుంచి అక్రమంగా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మద్యం బాటిళ్లు అక్రమ రవాణా చేస్తే వాటిని గుర్తించి ఆ షాపులకు మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా వేస్తామన్నారు. రెండోసారి పట్టుబడితే ఆ షాపు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సందీప్, ప్రవీణ్‌కుమార్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు

కొలిమిగుండ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగింపు(జంగిల్ క్లియరెన్స్) పనులు ప్రా రంభమైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంతరెడ్డి శనివారం వెల్లడించారు. మీర్జాపురం, కోరుమానుపల్లె, అబ్దులాపురం, గొర్విమానుపల్లె తదితర గ్రామాల ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రూ.5లక్షల నిధులతో 150 కిలోమీటర్లు రహదారుల్లో నెలకొన్న కంప చెట్లను తొలగిస్తున్నట్లు ఏఈ తెలిపారు. అదేవిధంగా తక్షణ మరమ్మతుల కోసం మరో రూ.30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

12న కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో ఈ నెల 12న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు, వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఉలువల నరసింహుడు శనివారం తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు, ఐవీ పక్కీరారెడ్డి సహకారంతో నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి వారు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి నంద్యాల ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు

కొలిమిగుండ్ల: మండలంలోని కోరుమానుపల్లె సమీపంలో వెలసిన గుండం ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక వన భోజనం మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. గౌడ మండల సంఘం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కామిని తిమ్మారెడ్డి, కొండయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామ మెట్ట వద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కీర్తిలక్ష్మణస్వామి స్వామివారికి అభిషేకం అలంకరణ చేసి గణపతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం చేసి నైవేద్యం పెట్టారు.

యాగంటిలో మహిళా అఘోరీ పూజలు



యాగంటిలో పూజలు చేస్తున్న మహిళా అఘోరి

బనగానపల్లె, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తూ హల్ చల్ చేస్తున్న మహిళ అఘోరి శనివారం బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆమెకు రక్షణగా వచ్చి యాగంటి దర్శనాన్ని కల్పించారు. యాగంటి క్షేత్రంలో మూలవిరాట్‌తో పాటు, నంది వద్ద ఆమె పూజలు చేశారు. బనగానపల్లెలో మహిళా అఘోరి పర్యటిస్తుందన్న విషయం తెలిసిన ప్రజలు పెద్ద ఎత్తున ఆమెను చూడటానికి ఆసక్తి చూపారు.

'అంతిమ' కష్టాలు

- పలు గ్రామాల్లో శ్మశానాలు ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు



ఏనుగమర్రి గ్రామంలో ఈ బ్రిడ్జి కిందనే శ్మశాన వాటిక



ఊటకొండలో ఆక్రమణకు గురికాగా.. మిగిలిన శ్మశాన స్థలం

ప్యాపిలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శ్మశానాలు ఆక్రమణకు గురయ్యాయి. దాంతో అంతిమసంస్కారానికి ఆరడుగుల స్థలం దొరకడం కష్టంగా మారింది. మండల కేంద్రమైన ప్యాపిలిలోని రెండు శ్మశాన వాటికలు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ ఆక్రమణలు జరిగిన ఎవరు పట్టించుకున్న పాపన పోలేదు. దీంతో ప్రజలకు ఆఖరి మజిలీకి ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని ఏనుగ మర్రి గ్రామం లో దశాబ్దాల క్రితం శ్మశాన భూమి 44వ జాతీయ రహదారి విస్తరణలో ముంపునకు గురైంది. అయితే అధి కారులు శ్మశా నానికి భూమిని చూప లేదు. గత్యం తరం లేక హైవే బ్రిడ్జి క్రిందనే శవా లను పూడ్చి పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే వెంగళాంపల్లి, ఊటకొండ, పోతుదొడ్డి, వెంకటాంపల్లి తదితర గ్రామాల్లో కూడా శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. స్థ లం ఆక్రమణకు గురికావడంతో పాత గుంతనే తీసి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఓ వైపు బంధువులను పోగొట్టుకున్న బాధకన్నా వారికి సరైన రీతిలో అంతిమ సంస్కారం నిర్వహించలేకపో యామనే బాధ ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. అధికారుల స్పందించి శ్మశానాలను సర్వే చేయించి ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డులు



ఉత్తమ ఉపాధ్యాయుడు సురేష్‌బాబు (డోన్)



నాన్సీ మేరీ యర్రగుంట్ల



సత్యప్రకాశ్ బనగానపల్లె

డోన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. ఈ నెల 11న నిర్వహించనున్న జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా అవార్డును ప్రదానం చేయనున్నారు. డోన్ పట్టణంలోని ఎస్‌ఎస్ కాలనీ హై స్కూల్ హెచ్‌ఎం డా.సురేష్ బాబుకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. గత ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో సురేష్‌బాబు ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఉత్తమ టీచర్ అవార్డు రావడం పట్ల హెచ్‌ఎం సురేష్‌బాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

శిరివెళ్ల: నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ స్టడీష్ ఉపాధ్యాయురాలు నాన్సీ మేరీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికయ్యారు. పాటలు, చిత్రాలతో విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో విద్యాబోధన చేయడం ద్వారా వంద శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నారు. అలాగే ఉపాధ్యాయురాలు నాన్సీ మేరీ స్వతహాగా కళాకారిణి కావడంతో పాటలు, గేయాలు రాయడం పాటు పుస్తకాలు సంకలనం చేసి పలు అవార్డులు అందుకున్నారు. ఆల్ ఇండియా రేడియో కడప స్టేషన్‌లో ఐదేళ్ల పాటు జానపద గేయాలు పాడారు. చిత్ర కళలో ప్రావీణ్యం ఉండడంతో రెండు జాతీయ అవార్డులు సైతం ఆమె అందుకున్నారు.

బనగానపల్లె : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించడంతో పాటు, సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న బనగానపల్లె కస్బా పాఠశాల ఎస్‌జీ సోషల్ ఉపాధ్యాయులు సత్యప్రకాశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో తన పేరు ఉం డటం ఎంతో సంతోషాన్ని కలిగించిందని సత్యప్రకాశ్ పేర్కొన్నారు. ఆయనను పలువురు ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

చట్టాల గురించి అవగాహన ఉండాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాల గురించి అవగాహన ఉండాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ అన్నారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శైలజ మాట్లాడుతూ న్యాయ సేవల చట్టం అక్టోబరు 11, 1987న రూపొంది, నవంబరు 11న అమలులోకి వచ్చిందన్నారు. న్యాయ సేవల వివిధ నిబంధనలు, ప్రజల హక్కుల గురించి వివరించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటి నివారణకు రూపొందించిన చట్టాలు తదితర వాటి గురించి ఆమె తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్, పట్టణ సీఐ చిరంజీవి, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే పరిశ్రమల ఏర్పాటు

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న సుబ్బారెడ్డి

డోన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చొరవతోనే ఉమ్మడి కర్నూలు జిల్లాకు పరిశ్రమలు వస్తున్నాయని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం శ్రీశైలం మల్లన్నను దర్శించుకుని సుబ్బారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో పరిశ్రమలు పెద్ద ఎత్తున రాబోతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని సుబ్బారెడ్డి అన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు నిర్వహించాలి



చాగలమర్రిలో ఓటరు నమోదు కేంద్రంలో బీఎల్‌వోలు

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు స్పెషల్ క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌సత్తార్ అన్నారు. శనివారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలోని ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం కూడా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఇమామ్‌బాషా, వెంకట్‌రామిరెడ్డి, సాయి, బీఎల్‌వోలు ప్రసన్న, పర్వీన్, ధరణి, మనోజ్, నరేష్‌రెడ్డి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. శనివారం ఎర్రగుడిదిన్నె, కొండమాయపల్లె, వెలగలపల్లె పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదుకు 31 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. బోడెమ్మనూరులో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

దొర్నిపాడు: ఓటరు నమోదును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం-6 సమర్పించాలని అన్నారు. ఓటరు తొలగింపునకు ఫారం- 7, మార్పులు, చేర్పుల కోసం ఫారం-8 సమర్పించాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 10, 23, 24 తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): ఆళ్లగడ్డ మండల పరిధిలోని చింతకుంట్ల, దేవరాయపురం, జంబులదిన్నె గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి శనివారం తనిఖీ చేశారు. కొత్త ఓటరు నమోదుతో పాటు తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను బీఎల్‌వోలు స్వీకరించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఓటరు నమోదుకు 85 దరఖాస్తులు వచ్చాయి.



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి

వైభవంగా కార్తీక దీపోత్సవం



రుద్రవరం మండలం వాసాపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చాగలమర్రిలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర, భైరవీశ్వర ఆలయాల్లో శనివారం కార్తీకమాసం సందర్భంగా మహిళలు 108 దీపాలు వెలిగించి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఎఫ్ సంయోజిత ప్రతినిధులు భవానిదేవి, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమం, విష్ణుసహస్ర పారాయణం చేశారు. శివపార్వతులకు పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలోని వాసాపురం భాస్కర నందీశ్వరాలయం, పలు గ్రామాల్లో శివాలయాల్లో శనివారం మహిళలు కార్తీక మాసం దీపాలు వెలిగించారు. అలాగే వెంకటేశ్వరస్వామికి లక్ష్మీగోదాదేవి అమ్మవారికి, మానస లింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమమవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రాయితీలను వినియోగించుకోండి

- కళ్యాణీ, ఉద్యాన శాఖ అధికారి



డోన్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం రైతులకు అందించే రాయి తీలను సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఉద్యానశాఖ అధికారి జి.కళ్యాణి అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు.

ప్రశ్న: డోన్ ఉద్యానశాఖ పరిధిలో ఎన్ని ఎకరాల సాగు ఉంది?

జవాబు: డోన్ ఉద్యాన శాఖ పరిధిలో డోన్, ప్యాపిలి మండలాలు ఉన్నాయి. డోన్ మండలంలో 9,831 ఎకరాలు, ప్యాపిలి మండలంలో 9,975 ఎకరాల తోటలు సాగులో ఉన్నాయి.

ప్రశ్న: రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారు..?

జవాబు: మామిడి, అరటి, చీని, జామ, దానిమ్మ పండ్లతోటలను పండిస్తు న్నారు. కూరగాయల కింద టమోటా, ఉల్లి పంటలు పండిస్తున్నారు. పూలతోట ల్లో బంతి, చామంతిని సాగు చేస్తున్నారు.

ప్రశ్న: రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలను వివరించండి..?

జవాబు : తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు సాధించడానికి పండ్ల తోట ల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇచ్చి రైతులను ప్రోత్సహి స్తుంది. అలాగే ఫారం పండ్లు ఏర్పాటుకు (నీటి కుంటల ఏర్పాటుకు) 50శాతం ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్విని యోగం చేసుకోవాలి. ఏదైనా సందేహాలు ఉంటే ఉద్యాన శాఖ అధికారిని సంప్రదించాలన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి



చాగలమర్రిలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శనివారం కూలూరు రహదారిలో టీడీపీ ఇన్‌చార్జి జెట్టి నాగరాజు, మల్లెంవీధిలో టీడీపీ నాయకుడు మురళీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్సర్‌బాషా మాట్లాడుతూ కార్యకర్తలందరూ సభ్యత్వ నమోదు తీసుకోవాలని అన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు మాబులాల్, టీడీపీ నాయకులు అనిఫ్, దాదాబీడీ బాష, అజీమ్, గఫార్, బారిక్‌చామల్, అబ్దుల్‌ఖాదర్, బాలకృష్ణ, రమేష్, మధు, బషీర్, శ్రీహరి, పరూక్, రియాజ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు సొమ్ము రాళ్లపాలు



నిరుపయోగంగా సర్వే రాళ్లు

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): జగనన్న భూరక్షా పథకం కోసం గత ప్రభుత్వం కొనుగోలు చేసిన గ్రానైట్ సర్వే రాళ్లను చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయం పక్కన పడేశారు. రైతులకు ఇష్టం లేక పోయిన వైసీపీ ప్రభుత్వం బలవంతంగా చేపట్టిన భూసర్వే అటకెక్కడంతో హద్దు రాళ్లు ఇలా నిరుపయోగంగా మారాయి. పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజా ధనం రాళ్లపాలైందని పలువురు విమర్శిస్తున్నారు. మరో వైపు ఈ రాళ్ల కొనుగోలులోని అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

25 మినీ గోకులాలు మంజూరు

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో 25 మినీ గోకులాలు మంజూరైనట్లు ఏపీవో నిర్మల తెలిపారు. శనివారం రాంపల్లె, చాగలమర్రి గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల మినీ గోకులాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినీ గోకులానికి రూ.2.30 లక్షలు ఉపాధి నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పాడి పశువులు పెంచుకునే రైతులకు ప్రభుత్వం మినీ గోకులాలను మంజూరు చేసిందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆమె వెంట టీఏ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మిత్రురాలి కుమారుడికి డిపాజిట్ పుస్తకం అందిస్తున్న మిత్రబృందం సభ్యులు

రుద్రవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మృతి చెందిన స్నేహితురాలి కుమారుడికి ఆర్థిక సాయం అందజేసి తోటి మిత్రులు తమ ఔదార్యం చాటుకున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన జయలక్ష్మి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు 2006-07 పదోతరగతి బ్యాచ్‌మెంట్లు మిత్రురాలి కుమారుడి పేరుపై పోస్టాఫీసులో రూ.50 వేలు ఫిక్స్‌డ్ చేసి పాస్‌బుక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో అనిల్‌గఫూర్, మస్తాన్, సురేంద్ర, పాములేటి, నర సింహ, వెంకటరమణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపు

రుద్రవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రుద్రవజుం ఆదర్శ పాఠశాలలో ఈ నెల 11 నుంచి ఆధార్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి శనివారం తెలిపారు. విద్యార్థులకు సంబంధించి వివరాలు మార్పులు చేర్పులు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. ఈ నెల 13 వరకు ఆధార్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు.

అవుకు: మండలంలోని విద్యార్థులు ఆధార్ స్పెషల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంగన్న శనివారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ అవుకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల 11 నుంచి 13 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఆధార్ స్పెషల్ క్యాంపుకు హాజరై తమ ఆధార్ కార్డుల్లోని తప్పులు , అన్ని రకాల మార్పులను సరిదిద్దుకోవచ్చని తెలిపారు.

పెద్దపులి కోసం డాగ్‌స్క్వాడ్‌తో గాలింపు

రుద్రవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం కారు ప్రమాదంలో పెద్దపులి గాయపడిన విషయం తెలిసింది. దాని ఆచూకీ కోసం సిబ్బంది వెతుకుతున్నారు. శనివారం ఎఫ్‌డీపీటీ డీడీ అనురాగ్‌మీనా ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో పెద్దపులి ఆచూకీ కోసం నల్లమలలో గాలించారు.